క్లుప్తంగా

నేడు సీఎం జన్మదిన వేడుకలు

జనగామ: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని నేడు(శుక్రవారం) నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తాలో మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదానం, ఆస్పత్రిలో పేషెంట్లకు పాలు, పండ్లు పంపిణీ చేపట్టనున్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు, అనుబంధ సంఘాలు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు ప్రతీ ఒక్కరు పాల్గొననున్నారు.

రేపు హనుమాన్ మందిర్‌లో గోపాష్టమి

జిల్లా కేంద్రం బాణాపురం గోపాల్ గోశాల హనుమాన్ మందిర్‌లో ఈనెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు గోపాష్టమి (గోమాత పూజ, హవనం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్ బజాజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఎత్తున హాజరై, గోమాత కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసిన ఉద్యోగులు



జనగామ ఆర్టీసీ డిపోలో నూతనంగా ఎన్నుకున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం మేనేజర్‌ను స్వాతిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందించారు. సంఘ డిపో అధ్యక్షులు జీఆర్‌లింగం. సెక్రటరీ శ్రీకాంత్, రాష్ట్ర, డిపో నాయకులు, కార్మికులు ఉన్నారు.

సీఎం అభిమాని పాదయాత్ర



బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డి అభిమాని వగలబోయిన శ్రీకాంత్‌గౌడ్ గురువారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు (శుక్రవారం) సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని పాదయాత్రను కొడవటూర్ సిద్దేశ్వరాలయం నుంచి చేపట్టినట్లు తెలిపారు. సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం పాదయాత్రగా యాదగిరిగుట్టకు చేరుకొని అక్కడ లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు నల్లగొని బాలకిషన్‌గౌడ్, రాము, కిరణ్, కనుకయ్య, రాజిరెడ్డి, భాస్కర్, శ్రీకాంత్, వెంకటేశ్ లు ఆయనను సన్మానించారు.

బారికేడ్ల ఏర్పాటు



పాలకుర్తి: పాలకుర్తి–తొర్రూరు వెళ్లే రహదారిలోని వావిలాల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగకుండా బారికేడ్లను ఎస్సై పవన్‌కుమార్ గురువారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా బారికేడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. కానిస్టేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి గీతాయజ్ఞంపై బోధన

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని అచల యోగా ఫౌండేషన్ ఆశ్రమంలో గీతా యజ్ఞంపై బోధిస్తారని ఫౌండేషన్ అధ్యక్షుడు బ్రహ్మానంద రాపెల్లి శ్రీధరస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల నుంచి గీతా యజ్ఞంపై బోధిస్తారని చెప్పారు. ఆసక్తిగల వారు యజ్ఞంలో పాల్గొనాలని కోరారు.

బాలికపై లైంగిక దాడి

● యువకుడిపై పోక్సో కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడగా పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.నరేష్ గురువారం తెలిపారు. ఏడాది క్రితం ఇదే బాలికపై సదరు యువకుడు లైంగికదాడికి యత్నించగా కేసు నమోదైనట్లు చెప్పారు. కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉన్న యువకుడు గ్రామానికి చేరుకొని ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారం చేశాడన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

● పట్టించుకోని సంబంధిత అధికారులు



గంజాయి(ఫైల్)

తరిగొప్పుల: మండలకేంద్రంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో యువత గంజాయి మత్తులో చిత్తవుతున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సమాజంలో ఎంజాయ్ కోసం యువత గంజాయికి అలవాటు పడుతోంది. సిగరేట్, మద్యం సేవించే అలవాటు ఉన్న కుర్రాళ్లు, స్థాయి దాటి గంజాయికి అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులే కాకుండా పాఠశాల స్థాయి విద్యార్థులు, ఖాళీగా ఉండే యువకులు గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారు. మండలంలోని పరిసర ప్రాంతాల్లో గుట్టుగా గంజాయి దందా సాగుతోంది. గతంలో మండల పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గంజాయి సేవిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపాల్‌కు తెలియడంతో సదరు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి విషయం బయటికి పొక్కకుండా లోలోపల కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మండలంలోని ఓ గ్రామంలో గంజాయి మత్తులో యువకుడు గతనెల దసరా పండుగ రోజు ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గంజాయికి అలవాటు పడిన యువకులకు నిత్యం సరఫరా చేసేందుకు కొందరు ముఠాగా ఏర్పడి గంజాయిని అందిజేస్తున్నారు. నిషేధిత గంజాయిని అరికట్టాల్సి పోలీసులు, ప్రత్యేక దృష్టి సారించలేకపోడంతో మండలకేంద్రంలో, పరిసర ప్రాంతాల్లో చాపకింద నీరులా సాగుతోందని ఆరోపణలు ఉన్నాయి. మండలకేంద్రంలోనే కాకుండా పలు గ్రామాల్లో వందలాది మంది యువకులు నిత్యం గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక కిరాణం షాపులో రోజుకు రెండు, మూడు సిగరేట్ ప్యాకెట్లు అమ్ముడుపోయేది. అలాంటిది ప్రస్తుతం రూ.4 వేల విలువ చేసే సిగరేట్ ప్యాకెట్లు అమ్ముడు పోతున్నాయి అంటే గంజాయి వాడకం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గంజాయి దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్సైలు

జనగామ: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధమని ఏసీపీ పార్థసారధి అన్నారు. ఏసీపీ నేతృత్వంలో సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనగామ సబ్ డివిజన్‌లోని 8 మంది ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలోని బాణాపురంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ఆర్టీఏ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా, పొల్యూషన్, రిజిస్ట్రేషన్, స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఇలా ప్రతి పత్రం ఉన్నప్పుడే వాహనం రోడ్డెక్కాలన్నారు. మైనర్లకు డ్రైవింగ్ చేసే అ వకాశం ఇస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టణం, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. కొత్త వారికి ఇంటి అద్దె ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తీసుకుని, ఆధార్ కార్డు పరిశీలించి, పోలీసులకు సైతం సమాచారం అందించాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో మూడు బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేయగా, 30 వాహనాలను పట్టుకుని ఆర్టీఏ నిబంధనలు ఉన్నాయా లేదా అని పరిశీలన చేస్తు న్నారు. కాగా, ఇటీవల కాలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 50 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. విచ్చల విడిగా పెరిగి పోతున్న బెల్ట్ దుకాణాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుంటే, పని ఒత్తిడి ఉన్నా సివిల్ పోలీసులే తనిఖీలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

చొప్పం చెరువులో వెంచర్ పరిశీలన



వెంచర్‌ను పరిశీలిస్తున్న ఏడీ మన్నెం కొండ

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట చొప్పం చెరువులో వెలసిన వెంచర్‌ను గురువారం ల్యాండ్ సర్వేయర్ ఏడీ మన్నెం కొండ పరిశీలించారు. పటేల్‌గూడేనికి చెందిన బోయిన రాజు గ్రీవెన్స్‌లో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఏర్పాటు చేసిన వెంచర్‌పై సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడీ మన్నెం కొండ వెంచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని, చెరువు ఎఫ్‌టీఎల్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులదని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ మహేందర్, ఫిర్యాదుదారుడు రాజు, మాజీ ఎంపీటీసీ సిద్ధు, నాయకులు నాగేందర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదుకు ఏర్పాట్లు చేయండి



లింగాలఘణపురం: కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



బచ్చన్నపేట: సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ మాధురిషా



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో సర్వేలో డీపీఓ స్వరూపారాణి

లింగాలఘణపురం: సమగ్ర కులగణన సర్వేలో కుటుంబాల ఆన్‌లైన్ నమోదు ఇబ్బందులు లేకుండా తగిన కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి సర్వే సక్రమంగా సాగుతుందా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఎంపీడీఓ జలేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకొని కంప్యూటరీకరణ గదిని పరిశీలించారు. ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి.. ఎక్కడి నుంచి తెప్పించారు సరిపడా ఉన్నాయా లేదా తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రం, బండ్లగూడెంలో స్టిక్కరింగ్ వేస్తున్న ఇళ్లను పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అండాలు, ఎంపీఓ రఘురామకృష్ణ, సూపర్‌వైజర్ మార్తా, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

బచ్చన్నపేట : సమగ్ర ఇంటింటి సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ మాధురి షా అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన సర్వేను పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి నర్సింహచారి, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి స్వరూపారాణి అన్నారు. జిల్లాలో చేపడుతున్న సమగ్ర సర్వేలో భాగంగా మండలంలోని ఇప్పగూడెం, ఛాగల్లులో గురువారం డీపీఓ సర్వేను పరిశీలించారు. ఎంపీఓ నర్సింగరావు,జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్టిక్కరింగ్

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో రెండో రోజు హౌస్ స్టిక్కరింగ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుమన్ మాట్లాడుతూ స్టిక్కరింగ్ ముగిసిన తర్వాత సమగ్ర కుటుంబ సర్వేను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా సాగరంలో స్టిక్కరింగ్ ప్రక్రియను తహసీల్దార్ శంకరయ్య పరిశీలించారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన తహసీల్దార్

చిల్పూరు: రెండో రోజు ఇంటింటి సర్వేను తహసీల్దార్ సరస్వతి పలు గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సర్వేకు సహకరించాలని అన్నారు.

మజ్దూర్ యూనియన్‌తోనే హక్కుల సాధన



నినాదాలు చేస్తున్న చిలుక స్వామి, కార్మికులు

చిల్పూరు: మజ్దూర్ యూనియన్‌తోనే కార్మికుల హక్కులు సాధించుకోవచ్చని ఏడీఎస్ ఈసీసీఎస్ అధ్యక్షుడు చిలుక స్వామి అన్నారు. రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని నష్కల్, పెండ్యాల స్టేషన్లలోని రైల్వే యూనిట్‌లో ఉన్న కార్మికులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంజనీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఇల్లందుల రాజేందర్, చైర్మన్ భిక్షపతి, లక్ష్మీనారాయణ, కరుణాచారి, భాస్కర్, గుండె కిషోర్‌బాబు, సాగర్, ప్రభాకర్, కిరణ్, శ్రీనివాస్, రాజు, బాలరాజు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు'



అమ్మాపురం గ్రామ కమిటీ

నర్మెట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా మాదిగ, మాదిగ ఉపకులాలను నమ్మిస్తూ మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మాదిగల తిరుగుబాటు తప్పదని ఎంఎస్పీ జాతీయ నాయకుడు చుంచు రాజు ధ్వజమెత్తారు. మండలంలోని వెల్దండ, అమ్మాపురంలో గ్రామ కమిటీలను గురువారం వేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తూ మాదిగ నిరుద్యోగులను డీఎస్సీ ఫలితాల్లో మోసం చేసిన విషయం మరిచిపోలేమని, తిరుగుబాటుతో కాంగ్రెస్‌ను రాజకీయ సమాధి చేయకతప్పదని అన్నారు. వెల్దండ, అమ్మాపురం గ్రామశాఖల అధ్యక్షులుగా కంతి సాయికుమార్, కుంటి శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా ముక్క మనోహర్, కుంటి వంశి, ఉపాధ్యక్షులుగా కంతి లాజర్, గోలుకొండ పవన్, అధికార ప్రతినిధి గద్దం మణిదీప్, కుంటి నవీణ్ , సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుంటి భాస్కర్, పండ్ల ఫణిందర్, వంశీకృష్ణ, పండ్ల బాలనర్సు, బాలకృష్ణ పాల్గొన్నారు.

తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామారావు

చిల్పూరు: కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని నాయబ్ తహసీల్దార్ మండడం రామారావు నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి, బాసెట్టి జయప్రకాష్ ఉన్నారు.

ఆర్థికసాయం



జఫర్‌గఢ్: వడ్డేగూడేనికి చెందిన బండ్ల కృష్ణ తండ్రి రాములు ఇటీవల మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న 2003 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కి చెందిన కృష్ణ స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.15 వేల సాయం అందజేశారు. ఎండీ ముజుఫొద్దీన్, బండ్ల భాస్కర్, రాజు, ఎం. పవన్ కుల్లా రాజు, బంగారు చిరంజీవి పాల్గొన్నారు.

లింగంపల్లిలో..



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మోతె గణేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ గ్రామానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2 వేల సాయం అందజేశారు. తుత్తురు రాజు, బారాజు, రాజు, రాజన్న, నర్సింహులు, కనుకయ్య, రవి, రవీంద్రచారి, రజనీకాంత్, రచ్చ రవీందర్ ఉన్నారు.

'సెయింట్ పాల్స్'లో చెకుముకి పోటీలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జనగామ: నెహ్రూపార్కు ఏరియాలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్–2024 పోటీలను నిర్వహించారు. 8,9,10 తరగతులకు చెందిన 452 మంది విద్యార్థులు పోటీలో పాల్గొని పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియ జోసఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన ఆటోడ్రైవర్‌కు సన్మానం



ఆటోడ్రైవర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మారపాక శ్రీనివాస్ తన ఆటోలో ప్రయాణికుడు మర్చిపోయిన మూడు తులాల బంగారం ఉన్న బ్యాగును తిరిగి అందించి నిజాయితీని చాటుకోగా అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ జి.వేణు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ శ్రీనివాస్‌ను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీసీ కుమార్, మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, ఆటో డ్రైవర్లు మారపాక శ్రీనివాస్, మారపాక కుమార్, ఎండీ.సాజిద్, వీరస్వామి, నంది, కరుణాకర్, శ్రీను, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జాతీయ రహదారి



రఘునాథపల్లి జాతీయ రహదారిపై వెలగని హైమాస్ట్ లైట్లు

● రఘునాథపల్లిలో వెలగని లైట్లు
● పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

రఘునాథపల్లి: మండల కేంద్రమైన రఘునాథపల్లిలో జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు సరిగా వెలగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెల రోజులుగా కొన్ని లైట్లు వెలగడం లేదని చిరువ్యాపారులు, ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకో వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వీస్ రోడ్డుకు ఇరు వైపులా ఉన్న పలు లైట్లు మరమ్మతులకు గురై వెలగడం లేదు. దీంతో చీకట్లు కమ్ముకోవడంతో ప్రజలు సర్వీస్ రోడ్డు గుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా నిడిగొండ, గోవర్ధనగిరి, కోమల్ల యూటర్న్‌ల వద్ద కొన్ని లైట్లు వెలగడం లేదు. దీంతో వాహనదారులు రాత్రి పూట పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లైట్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్తంగా

తొర్రూరుకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



దేవరుప్పుల: తొర్రూరు వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం పలు గ్రామాల నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మార్కెట్ నూతన చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డికి మండల పక్షాన జ్ఞాపిక అందించి సన్మానించారు.

విద్యార్థులకు అతిథి భోజనం



లింగాలఘణపురం: మండలంలోని కుందారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అతిథి భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయురాలు రమాదేవి పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు చికెన్‌తో అతిథి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవిశంకర్, ఉపాధ్యాయ బృందం రమాదేవిని అభినందించారు.

బీరు సీసాలో చెత్త

బచ్చన్నపేట: బీరు సీసాను కొనుకున్న యువకుడికి అందులో చెత్త కనిపించింది. గురువారం మండలంలోని లింగంపల్లికి చెందిన ఒగ్గు రాజు మన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఓ బెల్టుషాపులో కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ బీరు కొనుక్కొని దానిని ఓపెన్ చేసి చూడగా అందులో చెత్తా చెదారం కనిపించడంతో వెంటనే దానిని షాపు అతనికి ఇచ్చి వేశాడు. చెత్తా చెదారం ఉన్న దానిని తాగితే అనారోగ్యానికి గురవుతామని, దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎండీ లియాఖత్‌అలీ తల్లి ఖాజాబీ గురువారం మృతి చెందింది. కాగా, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గ్రామానికి చేరుకొని ఖాజాబీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నల్ల శ్రీరాములు, రెడ్డిరాజుల రమేష్, రతన్‌జీ తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల అందజేత



పాలకుర్తి: అమ్మా, నాన్నలు లేని ఇద్దరు అనాథ పిల్లలకు అమ్మ చారిటబుల్ ట్రస్టు సాయం అందజేసింది. మండలంలోని వావిలాలలో రెడ్డిమల్ల శారద –నరేష్ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, వారి పిల్లలు వర్షిత్, శ్రీవల్లినిలను ట్రస్టు సభ్యులు గురువారం పరామర్శించి నిత్యావసరాలు అందజేశారు. పరివేద శ్రీజ, ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, ఒర్రె కుమారస్వామి, కోల లక్ష్మణ్, వీరగాని అనిల్ ఉన్నారు.

దంత వైద్యశిబిరం



రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం హనుమకొండ డెంటల్ క్లినిక్ డాక్టర్ గౌడ శేషుకుమార్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. దంత వైద్య నిపుణురాలు డాక్టర్ నిఖిత విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జాన్ సుందర్‌రావు, ఉపాధ్యాయులు మాధవి, సంతోష్‌రెడ్డి, పుష్ప పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఉంటాం



దేవరుప్పుల: అకాల మృతి చెందిన అభాగ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కడవెండిలో పసునూరి రామ్‌చరణ్, నల్లకుంట తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు బానోత్ మోహన్, మాదాపూరం పందనబోయిన మల్లేష్, ఇస్తారి రాజశేఖర్ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నల్ల శ్రీరాములు, ఉప్పల సురేష్‌బాబు, అచ్చయ్య,శ్రీనివాసాచారి, పాండు, బానోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.